# భగవంతుడి బహుమానం

యస్. జయన్న

'నేలమీద, నింగిలోన పిండి ఆరబోసినట్లు
కుండలతో గుమ్మపాలు కుమ్మరించినట్లు
వెండిదూళి గాలికెగిరి నిలువెల్లా లేచినట్లు
మల్లెపూల వానజల్లు పైనుంచి కురిసినట్లు

వెన్నలమ్మ వెన్నల వచ్చిందమ్మా వెన్నల'' అనే పాటలలోని వెన్నలలా దీప... నాదీప నా కళ్ళ ముందు సాక్షాత్కరించింది.


ఆనందభాష్పలతో నాకళ్ళు చెమర్చాయి. జీవితములో మళ్ళీ కలుస్తామో లేదో అనుకున్న మేము ఇంత హఠాత్తుగా ఇలా కలుస్తామని నేనూహించలేదు. దీపను నా ప్రాణానికి ప్రాణంగా అభిమానించాను, ఆరాధించాను. గుండెల్లో గుడికట్టి దేవతలా ప్రతిష్ఠించి పూజించాను.

తాను కూడ అలాగే ఆరాధించింది. అలాంటి నాదీప నన్ను వెతుక్కుంటూ వచ్చి నన్ను చేరటముతో మాటల్లో చెప్పలేనంత సంతోషం కలిగింది నాకు. నా మదిలో మెదలే ఆలోచనలు కట్టిపెట్టి ''రా దీప అలా వెళ్ళి కూర్చొని మాట్లాడదాం'' అంటూ అటువైపుగా నడిచాను. దీప నన్ను అనుసరించి వచ్చింది. ఒక చెట్టు క్రింద కూర్చొని దీప అరచేతిని నా చేతుల్లోకి తీసుకొని ప్రేమతో నిమురుతూ ''ఎలా ఉన్నావు దీప'' అంటూ సంభాషణ ప్రారంభించాను. ''నిత్యం నిన్ను ఆరాధిస్తూ'' అంటూ కోయిల స్వరముతో పలికింది. ''చాలు చాలు దీప. చాలు నా జన్మకీ మాటలు'' అంటు ఉండగానే నానోటికి తన అరచేతిని అడ్డుపెట్టి ''అంతమాట అనొద్దు'' అంటూ తల అడ్డంగా కదలాడిస్తూ వేడుకున్నట్లుగా ముఖం పెట్టింది. నిజమే మరి దీపమీద నాకు, నామీద దీపకు ఎనలేని ప్రేమాభిమానాలు. దీపను మొదటిసారిగా చూసిన రోజు నాకింకా బాగా గుర్తుంది.

★ ★ ★

గత ఎనిమిది సంవత్సరాల క్రితం, మిత్రుడు రఘురామ్‌తో కలిసి డిగ్రీలో చేరాను. ఆరోజు రూమ్ చూడటం కొరకు నేను, రఘురాం టౌను కొచ్చాం మా ఊరి నుంచి. గతంలో మా ఫ్రెండ్స్ బషీర్, గురునాథ్‌గార్లు ఇక్కడే రూమ్ తీసుకొని ఉండేవారు. వారు ప్రస్తుతము డిగ్రీ పూర్తి

చేసుకొని వెళ్ళి సిటీలో పి.జి. చేస్తున్నారు. వారు ఈ ఊళ్ళో ఉన్నప్పుడు ఒకటి రెండుసార్లు వచ్చాం. అందుకే మొదటగా మా ఫ్రెండ్స్ ఉన్న రూమ్‌కి వెళ్ళాం. కానీ అది అప్పటికే ఎవరికో ఇచ్చేసారు. సీత కోసం హనుమంతుడి అన్వేషణలా రూమ్ కోసం గాలించాం. చాలాసేపు తిరిగి తిరిగి అలసిపోయిన మాకు ఒక వీధి చివరన టులెట్ బోర్డు తగిలించిన రూమ్‌లు కనిపించడంతో పోయిన ప్రాణాలు లేచివచ్చినట్లుగా సంతోషమేసింది మాకు. ''భగవంతుడు ఇప్పుడు కనికరించాడురా శివ మనమీద'' అంటు రఘు ఓ వేడి నిట్టూర్పు విడిచాడు. ''అప్పుడే ఏమైందీ ముందుంది ముసళ్ళ పండుగ, ముందు రూమ్, రెంటు అన్నీ నచ్చితే అప్పుడు తెగ సంతోష పడుదువుగానీ ముందు పద'' అంటూ రూమ్‌వైపు నడిచాను. రఘు కూడ అప్పటికే బాగ అలసిపోవడం వలన భారంగా అడుగులు వేస్తూ నన్ను అనుసరించి వచ్చాడు. రూమ్‌ల ప్రక్కగానే ఉన్న ఇల్లు రూమ్ ఓనర్ గారిదేనని తెలుసుకొని ఇంటివాకిలి ముందు నిలబడి అడ్డంగా ఉన్న తెరను ప్రక్కకు తీసి ''ఎవరు సార్ లోపల'' అని పిలిచాం. మమ్మల్ని చూసి డెబ్బైయోపడిలో పడిన ఓ వృద్ధుడు బయటికి వచ్చి ''ఏమిటి? ఎవరు కావాలి? ఎవరు మీరు?'' అంటూ గుక్క తిప్పుకోకుండా ప్రశ్నల మీద ప్రశ్నలు వేసాడు. ''తాతగారు, మాది ఈఊరికి ముప్పయ్ ఆరు కిలోమీటర్ల దూరంలోగల రామ్‌నగర్ మా ఊరు. మేము కాలేజి స్టూడెంట్సం. మాకు రూమ్ కావాలి''



అని చెప్పాం. ''నాకు జర చెవుడు. గట్టిగా చెప్పండి'' అని గదమాయించినట్లుగా మాట్లాడాడు. తాతగారి ఆజ్ఞానుసారం అలాగే చెప్పాం. ఇంతలో లోపలి నుంచి అవ్వ గారనుకుంటా తాతగారికి ఆడియోఫోన్ అందించింది. తాత దాన్ని చెవిలో సర్దుకొని సంభాషణ ప్రారంభించాడు. ఇప్పుడు అతనితో మాట్లాడటం మాకు కాస్త ఈజీ అన్పించింది. ''ఇదిగో ఈ ఐదు రూమ్‌లు నావే, ఇందులో నాలుగు రూమ్‌లు ఇప్పటికే భర్తీ అయ్యాయి. అదృష్టం బాగుండి మీకోసం ఐదో రూమ్ ఖాళీగా ఉంది. రండి చూపిస్తాను'' అంటూ రూమ్ తాళం తీసి చూయించాడు. రూమ్ చాలా చిన్నగా ఉంది.

వంట పాత్రలకి, బుక్స్‌కి మాత్రమే సరిపోయే విధంగా. మరి మేము ఎక్కడ ఉండాలో అర్థం కాలేదు. ఇకపోతే ఈ ఐదు రూమ్‌ల వాళ్ళందరికి ఇదే కామన్ బాత్‌రూమ్, లెట్రిన్ రూమ్‌లంటూ చూయించాడు. అయితే ఇక ప్రతిరోజు వాటి ముందు పెద్ద 'క్యూ' కట్టాల్సిందేనేమో అనుకున్నాను మనసులో. ''ఇది మీకందరికి త్రాగేందుకు మంచినీరు సరఫరా చేసే కుళాయి'' అని తాతగారు చెప్పారు. ''ఓరే శివ దీని వాలకం చూస్తుంటే నాకెందుకో అనుమానంగా ఉందిరా. ఇది కనీసం గంటకొక్క బిందె చొప్పుననైన నిండేటట్లు లేదు. ఎడారి జీవితం తప్పదు అంటూ'' రఘు నాచెవిలో మెల్లగా గుసగుసలాడాడు. ''పదిగంటలకల్లా కరెంటు తీసేయాలి, రూమ్ అద్దె మూడొందలు'' అంటు చెప్పారు తాతగారు. అన్ని వసతుల గురించి చెప్పిన అవి అవసరానికి వినియోగపడేలా లేవు. ఎందుకు అనవసరంగా ఎరగి ఇరుక్కొని ఇబ్బందులు పడటం. ముందే జారుకోవడం బెటరని అక్కడ నుంచి మెల్లగా జారుకున్నాం. తాతగారు తన ఉపన్యాసంతో తెప్పించిన తలనొప్పికి విరుగుడుగా అక్కడికి దగ్గర్లోనే కల ఓ క్యాంటిన్‌లో టీ త్రాగి మళ్లీ రూమ్ వేటలో పడ్డాం. అదృష్టం బాగుండి వెదికిన కొద్దిసేపటికే ఇంకో రూమ్ కంటపడింది. ఓనర్‌గారు రూమ్ చూయించారు. ''బాబు మీకు నచ్చితే అద్దె విషయం మాట్లాడదాం, ముందు రూమ్ చూడండి నేను ప్రక్క ఇంట్లో ఉంటాను వచ్చికలవండి'' అంటూ వెళ్ళిపోయాడు.

మేము రూమ్‌కి ఇలా అడుగు పెట్టామో లేదో? అలా బయటి నుంచి కాలి అందెల సవ్వడి మాచెవిని సోకింది. తలలు వంచి బయటికి చూశాం. మూర్ఛపోయినంత పనైంది మాకు. మత్తెక్కించిన ఆమె అందం చూసి, రాయంచలా నడుచుకుంటూ మా ఓనర్‌గారి ఇంట్లోకి వెళ్ళింది ఆ అందాల అప్సర. మసక మబ్బు కొండల్లో మెరిసిన మెరుపు తీగలా! ఓ మెరుపు మెరిసి అదృశ్యమైంది ఆదేవత. కళ్ళు బైర్లు కమ్మి తేరుకున్నట్లుగా ఫీలయ్యాం. ''ఏరా శివ ఎట్లుంది?'' రఘు ప్రశ్నించాడు. ''చాలా అందంగా'' అని చెప్పాను. ''ఏమిటి గురించి చెపుతున్నావురా?'' రఘు. ''ఇప్పుడు వెళ్ళిన ఆ అందాల కుందనపు బొమ్మ గురించి'' నేను చెప్పాను. ''నేనడుగుతున్నది రూమ్ గురించి'' రఘు చెప్పాడు. ''పోరి బాగుంటే ఎలాంటి రూమైనా బాగుండదా ఏంటి?'' నా జవాబు.

''మరయితే రూమ్ సెల్టక్టేనా?'' రఘు మళ్లీ అడిగాడు. ''రూమ్‌తోపాటు పోరి కూడా సెల్టక్టే''నని చెప్పాను. రఘురామ్ ఓనర్‌గారితో మాట్లాడి అద్దె, మిగతా అన్ని విషయాలు మాట్లాడి అడ్వాన్స్ కూడ ఇచ్చాడు. మరో పదిహేను రోజుల తర్వాత రూమ్‌లో జాయిన్ అయ్యాం. రూమ్‌లో చేరిన తర్వాత ఒక్కొక్కటిగా అన్ని విషయాలు తెలిశాయి. ఆరోజు కనిపించిన మెరుపుతార పేరు దీప అని, మా ఓనరుగారి కూతురని, మా క్లాసేనని తెలిసింది. మా ఆనందానికి హద్దులేకుండాపోయింది. ఓరకంగా చెప్పాలంటే ఆరోజు పండుగే మాకు. కొన్ని రోజుల తర్వాత మెల్ల మెల్లగా దీపతో మా పరిచయం, స్నేహం ఒకదాని తరువాత ఒకటి జరిగిపోయాయి. దీపతో అటు కాలేజిలోను, ఇటు ఇంటి దగ్గర కూడ చనువుగా మెలిగేవాళ్ళం. ఒకరి నోట్స్ ఒకరం తెచ్చుకునేవారం. ఏమైనా డౌట్సు ఉంటే తీర్చుకునేవాళ్ళం. డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు వ్రాశాం. కాలేజికి సెలవులు ప్రకటించారు. రూమ్ ఖాళీ చేసి వెళ్ళటమా? లేక అక్కడే ఉండిపోవటమా? ఎటు నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థలో పడిపోయాం. ఇంటి దగ్గరి ఆర్థిక పరిస్థితి గుర్తెరిగినదే. ఇంటి నుంచి ఎటువంటి సహాయ సహకారాలు ఆశించకుండా స్వంతంగా ఏదేని పనిచూసుకొని చేస్తూ అక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాం. మా మిత్రుడు శ్రీరామ్ సహాయంతో నేను, రఘు ఓ ఫైనాన్స్ కంపెనీ యందు పనిలో చేరాం. ఆ వేసవి సెలవుల యందు దీపతో నా స్నేహం ముదిరి ప్రేమకు దారితీసింది. చివరికి ఒకరిని విడిచి ఒకరం ఉండలేని స్థితికి చేరుకున్నాం. ఒక్కోసారి ఎప్పుడైనా అవసరం నిమిత్తం మా ఊరు వెళ్ళినా మళ్లీ వచ్చిన తరువాత రెండు రోజులదాక నాతో మాట్లాడకుండ ఎడమొకంగా, పెడమొకంగా వ్యవహరించేది దీప. ''అత్యవసర పరిస్థితులలో తప్ప మాఊరు వెళ్ళనని వెళ్ళిన అదే రోజు తప్పకుండ తిరిగి వస్తానని'' సంజాయిషి ఇచ్చుకునేదాక అలక మానేది కాదు. ''తాను కూడ ఎక్కడికి వెళ్ళనని, నిన్ను విడిచిపోనని, నిన్ను చూడనిదే ఒక్క క్షణం కూడ ఉండలేను''నేది దీప. అలా ఆగకుండా కదిలిపోయే కాలముతోపాటు మేము కూడ మూడు సంవత్సరాలు గడిపాం. ఈ మూడు సంవత్సరాలలో మా ప్రేమను, నన్ను కూడ ఎంతో ప్రోత్సహించి వెన్నంటి నిలిచిన మిత్రుడు రఘురామ్ సహాయము

## ఒకే కన్ను

''ఆయన బుకింగ్ క్లర్క్‌తో పోట్లాడుతున్నాడు ఎందుకు?''

''తనకుంది ఒక్క కన్నే కాబట్టి సినిమా టిక్కెట్టులో సగం డబ్బులే తీసుకోమంటున్నాడు.''

- సూదా శివరామకృష్ణ
(తెనాలి)


మరువలేనిది.

డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు వ్రాసిన కొద్దిరోజులకే దీప, నేను దిగ్భ్రాంతి చెందేలా ఓ వార్త నాచెవిన వేసింది. ''మా నాన్నకు ఉద్యోగరీత్యా వేరే ఊరికి ట్రాన్స్ఫర్ అయ్యింది. మరో పదిహేను రోజులలో మేము వెళ్ళిపోతున్నాం'' అంటూ బాధాతప్త హృదయముతో కన్నీళ్ళు కారుస్తూ. వెళ్ళేముందు పది రోజులు ఎలా గడిపామో అర్థం కాదు. ఇలా ఉండగానే దీప వాళ్ళు వెళ్ళే రోజు రానే వచ్చింది. ఆరోజంతా దీప, నేను ఎంతగా ఏడ్చామో భగవంతుడికి తెలుసు. ''తాము వెళ్ళిన తరువాత అన్ని విషయాలు తెలియజేస్తూ ఉత్తరం వ్రాస్తానని'' చెప్పింది దీప. నేను రఘు రూమ్ ఖాళీ చేసి మా ఊరు వచ్చాం. ఆ తర్వాత దీప నుంచి ఉత్తరం వస్తుందన్న ఆశతో చాలాకాలం పాటు ఎదురుచూశాను. కానీ నాఆశ నిరాశగానే మిగిలిపోయింది. ఎంతకీ దీప నుంచి ఉత్తరం రాలేదు. అక్కడి వాతావరణ పరిస్థితులు, అక్కడి వ్యక్తుల ప్రభావము వలన నన్ను మరిచిపోయిందేమో దీప అనుకున్నాను. దీప ఎక్కడుందో, ఏమి చేస్తుందో, ఎలా ఉందో తెలుసుకోవాలని నేను ఎంతో ప్రయత్నం చేశాను. కానీ ప్రయత్నాలు ఫలించలేదు. దీపతో కలిసి జీవించే అదృష్టగీత ఆ భగవంతుడు నానుదిటిన రాయలేదని నన్ను నేను ఓదార్చుకున్నాను.

అలా రోజులు..., మాసాలు..., సంవత్సరాలు గడిచిపోయాయి. మా ఇంటి పరిస్థితి దినదినానికి ఆర్థికంగా అస్తవ్యస్తంగా తయారు అయింది. పై చదువులు చదువడానికి సహాయపడని ఆర్థిక పరిస్థితి, వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల హీనస్థితి, తమ్ముళ్ళ చదువు సంధ్యలు, పోషణ భారము కుటుంబానికి పెద్దవాడినైన నాపైపడి మానసికంగాను, శారీరకంగాను కూడా ఎంతో కృంగిపోయాను. సంసార సాగర ప్రయాణములో కష్టాల సుడిగుండాలకు గురై నాబతుకు బలై పోయింది. అనారోగ్యముతో మంచం పట్టాను. తిరిగి మునుపటి వాడిలా కాకపోయిన కొద్దోగొప్పో ఆరోగ్యవంతుడిలా తయారు అయ్యేలోగా, నా హాస్పిటల్ ఖర్చులకి, అమ్మనాన్నల మందులకి ఇతరత్రా విషయాలకుగాను, తాతలనాటి ఆస్తిగా మాకు వారసత్వంగా వచ్చిన, మాకు జీవనాధారమై ఉన్న ఎకరం పొలం హారతి కర్పూరంలా కరిగిపోయింది. దినదినగండంగా గడుపుతూ మెతుకులు కూడ దొరకని మాబతుకులు బజార్నపడిపోయాయి. ఈనా పరిస్థితులు నేను ప్రాణంగా అభిమానించే దీపను అతిసునాయసంగా మర్చిపోవడానికి దోహదం చేశాయి.

★ ★ ★

అలా నా నుంచి దూరమైన దీప, నేను మర్చిపోయిన దీప అదృష్టదేవత తలుపు తట్టినట్లుగా, ఇప్పుడు తాను నన్ను వెతుక్కుంటూ రావడం నాకు ఆనందం కాకపోతే మరేంటి? ''ఏమిటి గురు అలా ఆలోచనలో మునిగిపోయావు'' అంటూ గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న నన్ను తట్టింది దీప. నా ఆలోచనలకి తెరదించేసి దీపతో చాలాసేపు చాలా విషయాలు మాట్లాడాను. మామధ్య కొద్దిసేపు




నిశ్శబ్దంగాను, కొద్దిసేపు సందిగ్ధంగాను కాలం గడిచిపోయింది. తరువాత దీప ''నేను వెళ్ళొస్తాను'' అంటూ లేచింది. ''అప్పుడే పోతావా? అలా అయితే ఇంక ఎందుకు రావడం? రాకుండ ఉండరాదు, వచ్చి పోతున్నాన్న విషాదాన్ని నాకు మిగిల్చిపోవడానికి వచ్చావా? నా మనసు క్షోభ పడితే నీకానందమా? చెప్పు దీప చెప్పు'' అంటూ ఆక్రోశించాను. ''అలా కోప్పడుతావెందుకోయి నాకు అక్కడ చాలా పనుంది. నేను వెళ్ళాలి. నీవు ఎలా ఉన్నావో చూసి వెళ్దామని వచ్చాను. చూసాను, వెళ్తున్నాను.'' అంటూ తనరెండు చేతులతో నాతలను దగ్గరికి తీసుకొని నా పెదవులపై, చెంపలపై తన లేత పెదవులతో అతి సుతారంగా ముద్దుపెట్టి ''నేను మళ్లీ వచ్చేదాక తీపిగుర్తుగా ఇది చాలా'' అంటూ నా నుంచి దూరంగా జరుగుతూ గాల్లో చేతులూపుతూ వీడ్కోలు తీసుకోని నా కళ్ళముందే కనుమరుగైపోయింది.

★ ★ ★

నా దీప వెళ్తూ... వెళ్తూ... తన **లేలేత** పెదవులతో అతి సుతారంగా ముద్దిడి**న ఈ** చెంప చల్లగా, హాయిగా ఉండాల్సింది**పోయి** ఎందుకో వేడెక్కినట్లుగా అన్పించింది **నాకు.** చేత్తో తడిమి చూసుకున్నాను. వేడెక్కినట్లు అన్పించడం కాదు నిజంగానే చాలా వేడెక్కింది. మెల్లగా కళ్ళు తెరిచి చూశా! బాగా ప్రొద్దెక్కినట్లుగా ఉంది. అందుకే ఎండ తీవ్రత కూడ మొదలైంది. అందునా ఎండకాలం మరీనూ! పూరిగుడిసె పైకప్పు రంధ్రాల ద్వారా సూర్యకిరణాలు సూటిగా చెంపపై పడటంవల్ల చెంప బాగ వేడెక్కింది. నాకు మెలకువ రావడం కూడ దీని ప్రభావమే నేమో? క్రిందుగా చూసుకున్నాను. గోనెసంచుల పరుపు ప్రక్కగా పడి ఉంది వెక్కిరిస్తున్నట్లుగా. అంటే ఇందాక దీప వచ్చింది నిజం కాదా? కల్లోన? ఆచేదు నిజం భరించలేకపోయింది నామనసు. భోరున విలపించాను. ''భగవంతుడా కల నిజం చేయరాదా? నీకు. జీవితాంతము రుణపడి

ఉండేవాణ్ని. నేను ప్రేమతో ఆరాధించే దీపను నానుంచి దూరము చేసిన నీవు, కనీసం కలలోనైనా కలిసామన్న తృప్తిని మిగల్చకుండా స్వప్నభంగం చేసావు. అసలు నీకు మనసంటూ ఉంటే ఇలా చేస్తావయ్యా'' అంటూ నాలో రేగిన కసిని భగవంతుడిపై తీర్చుకున్నాను.

ఉన్నట్లుండి నా అంతరాత్మ నాపై దాడికి పూనుకుంది. ''ఒరేయ్ అసలు నీకు బుద్ధుందా? భగవంతుడి నెందుకురా నిందిస్తావు. ఆయనేం చేసాడు. చేసుకున్నది నీవు. అనుభవిస్తున్నది నీవు. అన్నిటికి కారణం నీవు, నీ దరిద్రం. అంతేకానీ ఆయనేం చేసాడు.

ఒరే అంతేకాదు దీప నీకోసం మళ్ళీ వస్తుందని ఎలా ఆశలు పెంచుకున్నావురా? అప్పుడేమో అమాయ కంగా నీ ఆకర్షణలోపడి నిన్ను ప్రేమించిందే తప్ప నీ వెనుకున్న ఆర్థిక స్థితిగతులను బేరీజు వేసుకోలేదు. ఇప్పుడు వయస్సుతోపాటు తెలివి పెంచుకుంది. ఎవరినో తనని అన్నివిధాలా సుఖపెట్టే వరుడిని చూసుకొని హాయిగా జీవితములో స్థిరపడిపోయి ఉంటుంది. ఈ దరిద్రజీవి దగ్గరికి తిరిగి వచ్చి నిన్ను పెళ్ళి చేసుకుంటుంది అనుకోవడం వట్టి నీ భ్రమ మాత్రమే. చూసి చూసి ఎవరు కూడ నరకకూపములో దిగాలనుకోరు. అసలు ఏముందని నిన్ను ప్రేమిస్తారు. పెళ్ళి చేసుకుంటారు. నిన్ను నీవు పోషించుకోడానికే బతుకు బరువై భారంగా కాలాన్ని ఈదుతున్న నీవు ఆమెను ఏవిధంగా పోషించగలన నుకున్నావు. ఒరేయ్ రేగిపోయిన నీజుట్టు, చిరిగిపోయిన నీ చొక్కా, ఎండిపోయిన నీ డొక్క ఎవరు చూసిన ఇట్టే తెలిసిపోతుంది నీవు దరిద్ర నారాయణుడి, దురదృష్టలక్ష్మిల ముద్దుబిడ్డవని. ఒక దరిద్రుడికి ఉండవలసిన సర్వలక్షణాలు నీలో గోచరిస్తాయి ఎదుటి వారికి. దరిద్రుడు అంటే ఇలా ఉంటాడని చెప్పడానికి నీవో మచ్చుతునక.'' అంటూ నా అంతరాత్మ నాపై దాడిచేసి నాకు జ్ఞానోదయం కలిగించింది.

నిజమే ఉట్టి కెగరలేని నేను ఆకాశానికి అర్రులు చాచి నిచ్చెనలు వెయ్యాలనుకోవడం నా అవివేకం కాకపోతే మరేంటి? నిజంగా ఎవరినీ ప్రేమించే అర్హత నాకులేదు. ఒక్క నాకే కాదు నాలాంటి దరిద్ర నారాయణుడి ముద్దుబిడ్డలైన ప్రతి ఒక్కరికి కూడ ప్రేమించే అర్హత లేదు. దీప అందము లోను, ఆస్తుల్లోను ఆకాశాన్ని అంటితే, నేను అదోపాతాళానికి దిగజారుతాను. ఆమెకు నేను ఏవిధంగాను సాటిరాను.

మీరనొచ్చు ప్రేమకు కావల్సింది అందం, ఆస్తులు, అంతస్తులు, మతాలు కాదని నిర్మలమైన మనస్సు, ఆరాధన, అభిమానం, ఆప్యాయత, మానవత్వమని.

కానీ మారు తున్న కాలంతోపాటు మనసుల తరాలు, మనుషుల మనస్తత్వాలు మారి ఆ నిర్వచనాలు ఏనాడో మంటకలిసాయి.

ఇప్పుడంతా డబ్బు. సర్వం డబ్బు. డబ్బుతో దేనినైన కొనచ్చన్న అహంభావము ఇప్పుడు ప్రతివాడిలోను నిండుకుంది.

దీపను కోరుకోవడం నాతప్పే.

ఆశకంటూ హద్దు ఉండాలి.

హద్దుమీరితే అనర్థాలే కదా!

నాలాంటి పేదవాడికి ప్రేమించిన ఎదుటివారికి మధ్య కులం, మతం, ఆస్తులు, అంతస్థుల మధ్యగల అంతరం తరాలు మారిన మారనిది. ఇది నగ్నసత్యం. వీటికి మినహాయింపు ఒక కలలోనేమో? అందులో ఎవరితోనైనా ఏవిధంగానైనా వ్యవహరించవచ్చు. నియమ నిబంధనలంటూ ఏమీ ఉండవు. అందుకే తరాలు మారకున్న అంతరాలను దాటి కనీసం కలలోనైనా కనిపించిన దీపకు కోరుకున్న వారితో నిజజీవితంలో ఎలాగు కలిసి జీవించే అదృష్టములేని నాలాంటి దరిద్రజీవుల కోసం భగవంతుడు సృష్టించి, ప్రసాదించిన 'కల'ను 'భగవంతుడి బహుమానంగా' భావించి ఆదేవుడికి ఆత్మసాక్షిగా కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, ఎందుకూ పనికిరాని శరీరముతో, ఇంకా ఎవరికోసం? ఎందు కోసం? బతకాలో అర్థం కాని ఈ అయోమయపు గందరగోళ జీవితాన్ని చాలిస్తూ... ఈ మనసుల నుంచి, ఈ ప్రపంచము నుంచే సెలవు తీసుకుంటున్నాను.

★

